# అకశేరుకము

సీతారామయ్యకి చిన్నప్పటినుంచి ప్రతి విషయంలోను సర్దుకుపోవడమే అలవాటు. 'అదేవిటి?' అని అడగడంకాని, 'టాట్ వీల్లేదు' అని టలాయించడం కానీ చేతకాదు.

"మా సీతిగాడు బంగారు తండ్రి! నేను చెప్పినట్లు వింటాడు" అని వాళ్ళ నాన్న బుజ్జగిస్తూ కబుర్లు చెప్పినప్పుడు, 'సరే' అంటూ సరిపెట్టుకొని సెకెండరీ గ్రేడులోజేరి తర్వాత స్కూలు టీచరుగా కుదురుకున్నాడే కాని, "ఉహు! ఇన్ని మంచి మార్కులు వచ్చాయి నాకు. ఏదేనా కాలేజీలో జేరాల్సిందే!" అంటూ పేచీ పెట్టలేదు.

చదువు సంగతి సరే పెళ్ళి విషయంలోనూ అంతే!

"అందం ముఖ్యం కాదురా నాయనా! అయినింటి పిల్ల, అన్ని పనులూ చేతనవును. నాచేతికి ఆసరా అవుతుంది. కాదనకు ఒప్పుకోబాబు" అని అమ్మ బతిమాలినపుడు కాదనలేక తలవంచాడే కాని, "ఈ మసూచికం మచ్చల నల్లపిల్ల నాకు వద్దు" అని ఖండితంగా చెప్పలేకపోయాడు.

పండగలో పిలిచి మావగారు నాసిరకం బట్టలు పెట్టినపుడూ, 'ఆపరేషనూ లేదు ఏం లేదు అంటూ తన మాటని ఖాతరు చెయ్యకుండా ఉన్న కొడుక్కి, కూతురికి తోడు, మరో ఇద్దరు కూతుళ్ళని ఆ యింటి సభ్యుల జాబితాకి భార్య చేర్చినప్పుడూ, పై అధికారులు లంచాలుతిని, తనకంటే జూనియర్లని హెడ్మాస్టర్లుగా ప్రమోట్‌చేసి, తనని అమట్టునే ఉంచేసినపుడూ, చివరికి టిక్కెటు పంచదారా కిరసనాయిలు క్యూలలో తనని వెనక్కి తోసేసి, వాళ్ళూ, వీళ్ళూ ముందుకి వెళ్ళిపోతున్నప్పుడూ, "సరే – ఏం చేస్తాం అని సరిపెట్టుకుని వూరుకున్నాడే కాని, "వీల్లేదు" అంటూ అరిచి అల్లరి చేయలేదు సీతారామయ్య. మొన్నటికి మొన్న కొడుకు ఏడుస్తూ "నాకు తొంభయిలు

రావాలి నాన్నా. ఇవేం మార్కులు? కౌంటింగ్‌కి పెడదాం' అని గొడవచేస్తే, "పోనిద్దూ! రీకౌంటింగులూ, పేచీలూ, మనకివద్దు. ఆమార్కులు చాల్లే! బి.యస్సీలో చేరు" అన్నాడే కాని, "హత్తిరి! ఇంత అన్యాయమా?" అని అరవలేదు.

ఇలా పరిస్థితులతో రాజీపడిపోయి, ఏం చేస్తాం మనకింతే ప్రాప్తం అనుకుంటూ గొర్రెలాగా, గంగిగోవులాగా కాలం వెళ్ళబుచ్చుకుంటూ వస్తూన్న సీతారామయ్యకి బస్సులో ఆ కుర్రాడెవరో బాగా నచ్చాడు. అవునుమరి! కండక్టరు చిల్లరలేదంటే తనలాగే చాలామంది పదిపైసల్నీ పావలాలనీ వదులుక్కూచున్నారు కాని, పట్టు మని, పదహారేళ్ళయినా లేని ఆకుర్రాడు అలా సరిపెట్టుకోకుండా 'కయ్'మంటూ లేచాడు. "చిల్లరేనా ఇయ్యి, లేకపోతే ఇంత ఇయ్యాలని టిక్కెట్ల వెనకేనా రాసియ్యి" అంటూ పట్టు పట్టాడు. "నేనురాసివ్వను. ఇష్టంలేకపోతే బస్సు దిగు" అన్నాడు కండక్టరు. "దిగనూ దిగనూ. చిల్లర ఇవ్వకపోతే వూరుకోనూ వురుకోను" అంటూ మొండికేశాడు కుర్రాడు. కండక్టరు విజిల్ వేసి బస్సుని ఆమట్టున ఆపేశాడు.

"ఏవిటయ్యా పది పైసలకోసం ఈ గొడవ?" అంటూ ఎవరో విసుక్కో బోయారు. వెంటనే ఆకుర్రాడు "తప్పుని ఎదుర్కోనూలేరు. నాలాంటి వాడు ఎదుర్కొంటే సమర్థించనూలేరు. పైగా నిరుత్సాహపరచడం ఒకటి! ఇదిగో ఇలా సర్దుకుపోవడంవల్లే దేశం ఇలా తయారయింది. 'ఏవిటది' అని అడగండి. కనీసం, అడిగేవాడినయినా బలపర్చండి" అంటూ అరిచాడు ఆ కుర్రాడు. అంతే! అంతా మాట్లాడక వూరుకున్నారు.

ఎనభై యేళ్ళు పైబడ్డ ఓముసలాయన మాత్రం "సెభాష్ నాయనా! వెన్నెముక ఉన్న నీలాంటి కుర్రాళ్ళు వూరికి నలుగురుంటే చాలు, స్వాతంత్ర్యం కోసం మేం పడ్డ కష్టాలన్నీ ఫలించినట్టే" అన్నాడు. ఆయన గొంతువిని బస్సులో ఉన్న వాళ్ళలో ఇద్దరు ముగ్గురు చటుక్కున అటు తిరిగి "ఎవరూ? గాంధి పంతులు గారా!" అంటూ చేతులు జోడించారు. చివరికి ఎలాగైతేనేం ఆకుర్రాడు తను చిల్లర తీసుకోవడమేకాదు, ఎవరెవరికి ఎంతెంత చిల్లర రావాలో అంతంతా ఇప్పించాడు కండక్టరుచేత. తనకంటే పెద్దవాడుగా కనిపించిన ఆకుర్రాడిని పనిమాలా పలకరించి, ఆ రకంగా మనస్సులోని అభినందనల్ని మవునంగానైనా అందించాడు. నిజానికి అలా అందించలేకుండా ఉండలేకపోయాడు సీతారామయ్య.

బస్సుదిగి డి.ఇ.వో. ఆఫీసుకి వెళ్తున్న సీతారామయ్యకి ఉండుండి ఆ కుర్రాడి రూపమే జ్ఞాపకం రాసాగింది.

"ఇవాళ డి.ఇ.ఒ. గారు ఇంటర్వ్యూల హడావిడిలో ఉన్నారు. రెండు రోజులు

పోయాక మళ్ళీ రండి" అని ఆఫీసు సూపరింటెండెంట్ అన్నప్పుడూ, "ఎందుకొచ్చిన చాదస్తమయ్యా! తడవకోమారు వచ్చి వెళితే పది రూపాయలు కావడంలేదూ? ఎన్ని మార్లు ఎన్ని పదులు ఖర్చుపెట్టుకుంటావు? ఏభయి రూపాలు ఇలా ఇయ్యి అరగంటలో నీ పని పూర్తి చేయించి పెడతాను" అని బంట్రోతు తన చెవిలో రహస్యం వూది నప్పుడూ ఇందాకటి బస్సులో కుర్రాడు తనని ఆవేశించి, వో చేత్తో సూపరింటెండెంట్ కాలరూ, మరోచేత్తో బంట్రోతు జుట్టూ దొరకపుచ్చుకుని గుంజి గుంజి వదిలేస్తే బాగుండును అనుకున్నాడు సీతారామయ్య.

తియ్యని ఆలోచనే అది! కాని ఫలించడం?

ఫలించని తియ్యని ఆలోచనలతో, డి.ఇ.వో. ఆఫీసు మెట్లు దిగుతూన్న సీతారామయ్యకి, వరండాలో బెంచీల మీద కూర్చున్న యువకులలోంచి కలకలం వినిపించింది.

"ఏవిటీ? ఇంటర్వ్యూ అయిపోయిందా? ఉద్యోగాలు వేసేశారా? పొద్దటి నుంచి పాతికమందిమి ఈ బెంచీలమీద వేచిఉంటే, మాలో ఒకళ్ళని కూడా లోపలికి పిలిచి ఇంటర్వ్యూ చెయ్యకుండా, ఎపాయింట్‌మెంట్స్ ఎలా అయిపోయాయి?" అని వో కుర్రాడు అరిచాడు.

"లోపాయికారీగా వ్యవహారం సాగించి మీ ఇష్టంవచ్చిన వాళ్ళకి వేసెయ్య డానికి, ఇది మీ బాబుగారి పదవులేం కావు. ఇంతింత దూరం నుంచి వచ్చిన మమ్మల్ని ఇంటర్వ్యూ చేసి న్యాయంగా మాలో సమర్థుల్ని ఎన్నుకోవాలి. లేకపోతే సహించేదిలేదు" అంటూ కేకవేశాడు మరో కుర్రాడు. మిగిలిన పాతిక మందీ వాళ్ళతో కలిశారు - నినాదాలు - కేకలు - అరుపులు.

బంట్రోతు అదలించబోయాడు.

సూపరింటెండెంట్ సర్దిచెప్పబోయాడు.

"మితిమీరి ప్రవర్తిస్తే పోలీసుల్ని పిలిపిస్తాను" అంటూ ఇతలికి వచ్చి డి.ఇ.వో. బెదిరించబోయాడు. ఆ పాతిక మందీ దేనికీ చలించలేదు. అరుపులు సాగుతూనే ఉన్నాయి. అటూ, ఇటూ బెదిరింపులు పెరుగుతూనే ఉన్నాయి.

"పోలీసులకి ఫోన్ చెయ్యండి. మాకూ మంచిదే" అన్నారు కుర్రాళ్ళు. అందువల్ల వచ్చే అనర్థం ఏదో డి.ఇ.వోకి అర్థం అయింది. రాజీ బేరాలు ప్రారంభం అయ్యాయి. జరిగిన బినామీ ఎపాయింట్‌మెంట్స్, కేన్సిల్ చేసి ఇంటర్వ్యూలు తిరిగి మొదలెట్టి న్యాయంగానూ ధర్మంగానూ చేస్తానని వాగ్దానం చేసాడు డి.ఇ.ఒ.

దాంతో ఆ పాతికమంది కళ్ళూ సరేసరి! సీతారామయ్య కళ్ళు కూడా సంతోషంతోనూ కొత్త కాంతితోనూ మెరిశాయి! తనతరం చెయ్యలేని పనిని ఈతరం చేస్తోంది.

సెభాష్!

హాల్లోకి అడుగుపెడుతూన్న సీతారామయ్యకి కొత్త పుస్తకాలకి అట్ట లేసుకుంటున్న కొడుకు కనిపించాడు. ఆ కొడుకులో బస్సులో కుర్రాడూ, డి.ఇ.ఒ. ఆఫీసు దగ్గర నినాదాలు చేసిన పాతిక మంది కుర్రాళ్ళూ కనిపించారు. రాబోయే తరానికి ప్రతినిధి తన కొడుకు! విజయగర్వంతో చూసిన సీతారామయ్యకి కొత్త పుస్తకాలు వింతగా కనిపించాయి.

"అకశేరుకాలు.

"సకశేరుకాలు.

"ఏవిట్రా ఇలా ఉన్నాయి ఈ పుస్తకాలపేర్లు?" అనడిగాడు.

"ఇవి బియ్యేస్సీ జూఆలజీ పుస్తకాలు నాన్నా. 'కశేరుకము అంటే వెన్నెముక. అకశేరుకాలు అంటే వెన్నెముక లేని జంతువులు, సకశేరుకాలు అంటే వెన్నెముక ఉన్న జంతువులు.

ఆ మాటవిని సీతారామయ్య గతుక్కుమన్నాడు.

"వెన్నెముకలేని వాటియొక్క సంతతికి కూడా వెన్నెముక ఉండదా? దాదాపు అరిచినట్టే అడిగాడు.

"జీవ పరిణామ సిద్ధాంతం ప్రకారం....."

అంటూ వాడు ఏదో చెప్పబోయాడు. సీతారామయ్య మాత్రం "వీల్లేదు నా కొడుకుకూడా నాలాగ 'అకశేరుకము' కాకూడదు. వాడు సకశేరుడు కావాలి. వాడికి వెన్నెముక ఉండాలి. అంటూ వేదనలో మునిగిపోయి, తనలో తను గొణుక్కొంటూ ...లో ఆమట్టునే కూర్చుని ఉండిపోయాడు.

(ఆంధ్రప్రభ, 15-1-1984)

*